నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 19 డిసెంబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## వైద్య కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలి



గుత్తేదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

హాజీపూర్, డిసెంబర్ 18 : గుడిపేటలో చేపడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం గుడిపేటలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవనాన్ని పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్లు, భవనాల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అనూష పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

## ఆదివాసీ గ్రామాలాభివృద్ధికి కృషి చేయాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, డిసెంబర్ 18 : జిల్లాలోని ఆదివాసీ గ్రామాలాభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్‌తో కలిసి ఆదివాసీ నాయకులు, సర్‌మేడీలు, పటేళ్లతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని గిరిజన గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, అభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య రంగాల్లో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివాసీ గ్రామాలకు రహదారులు, వంతెనల నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, ఇందుకోసం అటవీశాఖ అనుమతులు పొందేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారాం, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వరి జోషి, పంచాయతీరాజ్ ఈఈ ప్రభాకర్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ, ఇంజినీరింగ్, వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఇందారం శివారులోని రహదారి వద్ద కమ్ముకున్న పొగమంచు

ఉదయిస్తున్న సూర్యుడు

# చలి.. తగ్గదే లే



సిర్పూర్(యూ) : చలి మంటకాగుతున్న పిల్లలు, వృద్ధులు

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై పంజా

- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో రాష్ట్రంలోనే అత్యల్పంగా 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు
- ఆదిలాబాద్ జిల్లా బేలలో 6 డిగ్రీలు, నిర్మల్ జిల్లా మామడలో 7.3 డిగ్రీలు
- బయటికి రావాలంటేనే వణుకుతున్న జనాలు
- ఆదిలాబాద్ జిల్లాలో స్కూళ్ల వేళలు మారుస్తూ కలెక్టర్ ఆదేశాలు


మంచిర్యాల, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను చలి వణికిస్తున్నది. గడిచిన నాలుగైదు రోజుల్లో ఇక్కడ తగ్గిందే లేదు. రాష్ట్రంలోనే అతితక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మధ్యాహ్నం సైతం వాతావరణం చల్లగానే ఉంటుంది. సాయంత్రం 6 గంటలయ్యిందంటే చాలు జనాలు బయటికి రావడం లేదు. ఉదయం 8 గంటల దాటాక కూడా వాతావరణం పొగమంచుతో కప్పి ఉంటుంది. నిత్యం జన సంచారం, వాహనాల రాకపోకలతో రద్దీగా కనిపించే రోడ్లు చీకటి పడిందంటే చాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. తెలంగాణ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ(టీజీడీపీఎస్) ప్రకారం.. బుధవారం రాష్ట్రంలోనే అత్యల్పంగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ)లో 5.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేలలో మంగళవారం 5.8 డిగ్రీలు ఉంటే, బుధవారం 6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఇక నిర్మల్ జిల్లా మామడ మండలం తంద్రా గ్రామంలో 7.3 డిగ్రీలు, మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్‌పూర్‌లో 9.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని టాప్ 15 జిల్లాల్లో నాలుగు జిల్లాలు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచే ఉన్నాయంటే ఇక్కడ చలి తీవ్రత ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

### పడిపోనున్న ఉష్ణోగ్రతలు

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో దక్షిణ బంగాళఖాతంలోని మధ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఫలితంగా రానున్న రెండు, మూడు రోజులు ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఒక్కసారిగా వాతావరణంలో వచ్చిన మార్పుల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేగానీ బయటికి రాకూడదని, తెల్లవారుజామున, రాత్రి వేళ బయటికి వస్తే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(యూ), తిర్యాణి మండలాల్లో నాలుగు నుంచి ఐదు డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయి.

### స్కూళ్ల వేళల్లో మార్పులు..

ఆదిలాబాద్ జిల్లాలో చలి తీవ్రత దృష్ట్యా ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్ల పని వేళలను మార్పు చేస్తూ కలెక్టర్ రాజర్షి షా బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటి వరకు ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉండగా, ప్రస్తుతం ఉదయం 9.40 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటలక మారుస్తున్నట్లు పేర్కొన్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ మార్చిన సమయాన్నే కొనసాగించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు డీఈవో, ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధాన ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు.




## చలి తీవ్రతపై జాగ్రత్తలు పాటించాలి

- డీఎంహెచ్‌వో హరీశ్‌రాజ్




సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 18 : చలి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీశ్ రాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఆయన పలు సూచనలు చెప్పారు. చలికి రక్షణ కోసం వెచ్చని దుస్తులు ధరించడంతో పాటు సీ విటమిన్‌కు సంబంధించిన ఆహార పదార్థాలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. చలికాలంలో నీరు తక్కువగా తాగే అలవాటు ఉంటే శరీరానికి హాని అని, రోజుకు నాలుగు నుంచి ఐదు లీటర్ల నీరు తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం చేయడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందని, చర్మం ఎండిపోకుండా ఉండేందుకు కొబ్బరి నూనె లేక మాయిశ్చరైజర్‌ను వాడాలని, వేడి నీటితో స్నానం చేయాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, చలి మంటలు వేసుకోవద్దని సూచించారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భవతులు, మధుమేహం, హైపర్ టెన్షన్ ఉన్నవారు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీమాలిస్ట్ సుమన్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.




జన్నారం కవ్వాల్ అడవుల సందర్శనకు సఫారీలో వెళ్తున్న ఏజీ బృందం సభ్యులు

## కవ్వాల్ అభయారణ్యంలో ఏజీ బృందం సందర్శన

జన్నారం, డిసెంబర్ 18 : హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ జనరల్ బృందం సభ్యులు కవ్వాల్ టైగర్ రిజర్వుడ్ అడవులను సఫారీలో బుధవారం సందర్శించారు. గోండుగూడ బేస్‌క్యాంప్, మల్యాల వాచ్ టవర్, బైసన్‌కుంట తదితర అటవీ ప్రాంతాల్లో పర్యాటించారు. వన్యపాణుల సంరక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఎఫ్‌బీవో శ్రీనివాస్ ఉన్నారు

### కవ్వాల్ అడవుల్లో విద్యార్థులకు వనదర్శి

బైసన్‌కుంట ప్రాంతంతో పాటు జింకల శరణాలయం, సీతాకోక చిలుకల ప్లాంటేషన్, బేస్‌క్యాంప్ అడవుల్లో దండేపల్లి మండలం గుడిరేవు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వనదర్శి ద్వారా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, అటవీ అధికారులు సాగరిక, లాల్‌బాయి, రహీమొద్దీన్ ఉన్నారు.

## మంచిర్యాల బల్దియాకు 32 మంది గ్రూప్-4 ఉద్యోగులు



జాయినింగ్ లెటర్ ఇస్తున్న కమిషనర్ మారుతీ ప్రసాద్

మంచిర్యాలటౌన్, డిసెంబర్ 18 : మంచిర్యాల మున్సిపాలిటీకి 32 మంది గ్రూప్-4 ఉద్యోగులు నియామకమయ్యారు. వీరిలో 28 మంది వార్డు ఆఫీసర్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్‌లు, ఇద్దరు జూనియర్ అకౌంటెంట్‌లు ఉన్నారు. వారిలో బుధవారం ఐదుగురు అభ్యర్థులు ఉద్యోగంలో చేరారు. మిగిలిన వారు కూడా ఒకటీ రెండు రోజుల్లో వచ్చి జాయిన్ అవుతామని సమాచారం ఇచ్చినట్లు అధికారులు చెప్పారు. కొత్తగా వచ్చిన ఉద్యోగులకు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ చేతుల మీదుగా జాయినింగ్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నూతన ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ విజయ్‌కుమార్, రెవెన్యూ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు
- పవర్‌గూడలో పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



పవర్‌గూడలో పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ చేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

సిర్పూర్(యూ), డిసెంబర్ 18 : నేటి సమాజంలో పెరుగుతున్న నేరాలకు వ్యసనాలే కారణమని ఎస్పీ డీవీ. శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు మీకోసంలో భాగంగా బుధవారం పవర్‌గూడలో ఆదివాసీ వృద్ధులకు దుప్పట్లు, యువకులకు వాలీబాల్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. ఎవరైనా గంజాయి సాగు చేస్తే తమకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, మద్యం సేవించడం, నిషేధిత గుట్కాలు నమలడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. వీటికి అలవాటు పడిన వారే నేరస్తులుగా మారుతున్నారన్నారు. ఖమ్మగూడ నుంచి కాకరబొడ్డి గ్రామం వరకు బీటీ రోడ్డు వేయిస్తామన్నారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు, మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు, డీఎస్పీ కరుణాకర్, జైనూర్ సీఐ రమేశ్, ఎస్‌ఐలు రామారావు, రామకృష్ణారావు, అధికారులు ప్రహ్లాద్, నారోరావు, వెంకట్రావు పాల్గొన్నారు.

## యువత అన్ని రంగాల్లో రాణించాలి

- ప్రజల సంరక్షణే మా ధ్యేయం
- రామగుండం సీపీ శ్రీనివాస్
- గొర్లపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

వేమనపల్లి, డిసెంబర్ 18 : యువత వ్యసనాలకు బానిస కావద్దని, అన్ని రంగాల్లో రాణించి ఉన్నతంగా ఎదగాలని రామగుండం సీపీ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం గొర్లపల్లి గ్రామ సమీపంలోని క్రాస్ వద్ద ఉన్న ఆశ్రమ పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యల పరిష్కారంలో పోలీసులు ముందుంటారన్నారు. మావోయిస్టు ప్రాంతాల్లో నివసించే ప్రజల సంరక్షణ తమ ధ్యేయమన్నారు. నిరుపేద కుటుంబాలను దృష్టిలో పెట్టుకొని మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలోని సుమారు 800 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. యువతకు వాలీబాల్ కిట్లు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామస్తులకు భోజనం పెట్టారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ అడ్మిన్ సీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్‌ఐ శ్యాంపటేల్, కోటపల్లి ఎస్‌ఐ రాజేందర్, మాజీ జడ్పీటీసీ సంతోష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సామాజిక కార్యకర్తపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

మంచిర్యాల, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నయీంపాషాపై గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం దాడికి పాల్పడ్డారు. భూ వివాదానికి సంబంధించి 'మీ స్నేహితుడితో మాట్లాడాలి. మీరు చెప్తే పని అవుతుంది' అంటూ ఓ వ్యక్తి నయీంపాషాకు ఫోన్ చేశాడు. తనకు సంబంధం లేని విషయమని చెప్పినా.. రెండు రోజులుగా తరచూ ఫోన్లు చేస్తుండడంతో బుధవారం ఉదయం వస్తానని నయీంపాషా.. సదరు వ్యక్తికి చెప్పాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం నయీంను తాళ్లపెల్లి ఆర్‌అండ్‌ఆర్ కమాన్ వద్దకు పిలిపించారు. ఐదారుగురు వెనకనుంచి వచ్చి రాయితో తలపై దాడి చేశారు. తేరుకొని అక్కడి నుంచి పారిపోయే ప్రయత్నం చేయగా, తరముకుంటూ వచ్చి నెట్టేశారు. కిందపడిన నయీంపాషాపై దాడి చేశారు. 'నువ్వు ప్రతి ఇష్యూను బయటికి లాగుతున్నావ్. రాజకీయాల్లో ఇన్‌వాల్వ్ అవుతున్నావ్... ఇప్పటికైనా మారు. ఈ సారి కొట్టి వదిలేస్తున్నాం. మరోసారి చంపేస్తాం' అంటూ బెదిరించినట్లు బాధితుడు తెలిపాడు. ఈ విషయమై నస్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేశానని నయీపాషా తెలిపాడు.

## అర్ధరాత్రి అకారణంగా తిరుగొద్దు

- ఏసీపీ ఆర్‌ప్రకాశ్

మంచిర్యాల అర్బన్, డిసెంబర్ 18 : అర్ధరాత్రి అకారణంగా బయట తిరుగొద్దని మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాశ్ పేర్కొన్నారు. ఆపరేషన్ చబుత్రలో భాగంగా మంగళవారం అర్ధరాత్రి పట్టణంలోని ఐబీ, బెల్లంపల్లి చౌరస్తా, బస్టాండ్ ఏరియా, ముఖరాం చౌరస్తా, ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేపట్టారు. వాహనదారుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేశారు. తనిఖీల్లో పట్టుబడ్డ సుమారు 110కి పైగా మందిని పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏసీపీ మాట్లాడుతూ రాత్రి 10 గంటల తర్వాత రోడ్లపై కారణం లేకుండా తిరిగేవారిని అదుపులోకి తీసుకుంటామని, మొదటి సారి అయితే కౌన్సెలింగ్ నిర్వహించి వదిలేస్తామని, మూడుసార్ల కంటే ఎక్కువ సార్లు పట్టుబడితే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ ప్రమోద్ రావు, మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ నరేశ్ కుమార్, ఎస్‌ఐ రాములు, సిబ్బంది ఉన్నారు.



తనిఖీల్లో పట్టుబడిన వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న ఏసీపీ ప్రకాశ్